క్లుప్తంగా

నేడు కనక మహాలక్ష్మమ్మ జాతర



మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత శ్రీకనక మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం సోమవారం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. రాత్రి అమ్మవారి జాతర, మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని, బుధవారం అమ్మవారి తీర్థం నిర్వహిస్తారన్నారు. 17న అన్న సమారాధన ఉంటుందని చైర్మన్ తెలిపారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా శంకరాచార్య జయంతి

అంబాజీపేట: ముక్కామల శ్రీఆది శంకరాచార్య స్వామివారి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్య స్వామి జయంతి మహోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహంతో ఆలయ ధర్మకర్త దువ్వూరి బాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో శంకరాచార్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామకోటి శైవాగమ పాఠశాల విద్యార్థులచే ఆది శంకరాచార్య స్వామివారికి వేదపఠనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

యానాం: కనకాలపేటలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పోలేరమ్మ వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, పోలేరమ్మ యూత్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు



రావులపాలెం కాలువ అవతలి రోడ్డులో నేలకూలిన భారీ వృక్షం

రావులపాలెం: రావులపాలెంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలకు చెట్లు నేలకొరగడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక భద్ర మహంకాళమ్మ పుంత, కాలువ అవతల రోడ్డుపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

నైతిక విలువలు పెంచుకోవాలి

అమలాపురం టౌన్: బాల వికాస్ తరగతుల ద్వారా పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు అలవడతాయని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పలోని బాల వికాస్ కేంద్రం ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 100 మంది బాల బాలికలతో కొత్త కేంద్రం ఏర్పాటైందన్నారు. చిన్నారులకు ఉదయమే ఓం కారం, ధ్యానం, గాయత్రీ మంత్రం, నీతి కథలు, నైతిక విలువలు, కుటుంబ బంధాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

రామచంద్రపురం: ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారందరికి అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తొగరు మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వైద్య రంగంలో కీలకమైన నర్సుల గౌరవాన్ని, హుందా తనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకొంటున్నారన్నారు. ఏరియా హాస్పిటల్‌తో ప్రతిరోజు వందలాది మంది రోగులకు సేవలను అందజేస్తున్న నర్సులకు ఈ సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టిన సిస్టర్స్ సేవలను మరువలేమని తెలిపారు.



కొత్తపేటలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రిని విడుదల చేస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ



రాజోలు నుంచి తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



ముంగండలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



ముంగండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ వద్ద పోలింగ్ బూత్‌లో సిబ్బంది

ఓటంటే వెలుగు చుక్క



కొత్తపేటలో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో సిద్ధమైన సిబ్బంది

- ఓటుహక్కు వినియోగించుకోవాలని అధికారుల పిలుపు
- నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్
- మూడు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి

కొత్తపేట: ఓటంటే నీ గొంతుక.. భవిష్యత్తును తీర్చిదిద్దే గీతిక.. ఎన్నికల్లో ప్రతి ఓటుదీ కీలక భూమిక.. ఒక ఓటు వల్ల ఒరిగిందేమీ లేదనుకుంటే తప్పులో కాలేసినట్టే. గత ఎన్నికల్లో ఒక్క ఓటుతో సీటు తారుమారైన సందర్భాలున్నాయి.. అలాంటి ఓటును అంతా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం జరిగే ఓట్ల పండగకు సర్వం సిద్ధమైంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లపై ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఆర్‌ఓ) జీవీవీ సత్యనారాయణ 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో 2,52,383 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ నిర్వహణకు కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో మొత్తం 262 పోలింగ్ స్టేషన్లు (పీఎస్) ఏర్పాటు చేశారు. ఒక్కో పీఎస్‌కు పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి ఒకటి చొప్పున 262 పీఎస్‌లకు 524 ఈవీఎంలతో పాటు రిజర్వ్‌లో 104తో మొత్తం 628 ఈవీఎంలను సిద్ధం చేశారు. ప్రతి పీఎస్‌కు పీఓ, ఏపీఓ, నలుగురు ఓపీఓల చొప్పున మొత్తం పీఎస్‌లకు 262 మంది పీఓలు, 262 మంది ఏపీఓలు, 1,048 మంది ఓపీఓలు, 319 మంది రిజర్వ్ సిబ్బందితో మొత్తం 1,883 మందిని నియమించారు. 216 పీఎస్‌లలో వెబ్‌కాస్ట్ ఏర్పాటు చేశారు. 110 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ప్రతి పీఎస్ వద్ద హెల్ప్ డెస్క్ పెట్టారు. దివ్యాంగుల కోసం 95 వీల్ చైర్స్ సిద్ధం చేశారు. వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అమలాపురం పార్లమెంట్, అసెంబ్లీ పరిశీలకుల పర్యవేక్షణలో ఆర్డీఓ, ఆర్‌ఓ జీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఏఆర్‌ఓలు ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు మొబైల్స్ తీసుకురాదని ఆర్డీఓ తెలిపారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కావడంతో నియోజకవర్గంలో మొత్తం 262 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సిబ్బందికి ఈవీఎంలు, ఇతర పరికరాలు, సామగ్రి పంపిణీ చేశారు. ఒక్కసారిగా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ పరికరాలు తీసుకెళ్లడానికి సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు.

భారీ పోలీసు బందోబస్తు

కొత్తపేట నియోజకవర్గంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 120 మంది సీఆర్పీఎఫ్, 90 మంది రాజస్తాన్ ఆర్మ్‌డ్ ఫోర్స్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రత్యేక బందోబస్తును తిరుపతి, గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వర్, ఏఎస్పీ చెలసాని గోపి పర్యవేక్షణలో స్థానిక డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో మండలానికి ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, సుమారు 460 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, పీసీలతో పాటు స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో ఏర్పాటు చేశారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు డీఎస్పీ రమణ తెలిపారు.

పి.గన్నవరం నియోజకవర్గంలో..

పి.గన్నవరం: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఇక్కడి నుంచి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎన్నికల సామగ్రితో వెళ్లారు. సామగ్రి పంపిణీని జిల్లా ప్రత్యేక పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్ పరిశీలించి, ఆర్‌ఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో 212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 57 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి, అక్కడ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,98,602 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత నిర్వహించేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి టెంట్‌లు, కుర్చీలు, ఓటర్ల స్లిప్‌లు పంచరాదన్నారు. అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలను 4 రూట్లుగా విభజించామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, స్థానికులు సహకరించాలన్నారు. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ జె.విమల కుమారి తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 45 వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకూ ఎవ్వరూ ఉండరాదన్నారు.

రాజోలు నియోజకవర్గంలో..

రాజోలు, మలికిపురం: నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ పర్యవేక్షణలో సిబ్బందికి విధులు కేటాయించారు. నియోజకవర్గంలో 205 పోలింగ్ బూత్‌లకు 410 మంది పీఓ, ఏపీఓలతోపాటు 1,025 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బందితోపాటు మెటీరియల్ తరలించేందుకు బస్సులు, వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో విధులకు హాజరయ్యే విధంగా 92 మంది రిజర్వుస్టాఫ్‌ను అందుబాటులో ఉంచారు. 16 మంది సెక్టోరియల్ ఆఫీసర్లు, 43 మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బంది, 75 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని రాజోలు సీఐ గోవిందరాజు తెలిపారు. ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, తొమ్మిది మంది సీఐలు, 17 మంది ఎస్సైలు, 43 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 69 మంది కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది మహిళా కానిస్టేబుళ్లు, 45 మంది హోమ్‌గార్డులు ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,96,233 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

అయినవిల్లి: అయినవిల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ ప్రమద్వర పరిశీలించారు. తొత్తరమూడి, విలస, అయినవిల్లి పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఆమె సమీక్షించారు.

ఆకర్షిస్తూ.. ఆహ్వానం పలుకుతూ

మామిడికుదురు: ఓటర్లు ఆహ్లాదకరమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒక్కో మండలంలో ఒక్కో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలో 37వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. పి.గన్నవరం మండలం ముంగండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ కేంద్రం, అంబాజీపేటలోని మాచవరంలో 120వ పోలింగ్ కేంద్రం, అయినవిల్లిలోని 179వ పోలింగ్ కేంద్రంతో పాటు నల్లచెరువులో కేవలం మహిళా పోలింగ్ సిబ్బందితోనే 159వ పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల పచ్చని తివాచీలు ఏర్పాటు చేసి ఓటర్లకు స్వాగతం పలుకుతూ చేసిన ఏర్పాట్లు ఆకర్షిస్తున్నాయి.



నగరంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

వైఎస్సార్ సీపీ విజయ దుందుభి ఖాయం



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: కొత్తపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోని ప్రజలు పార్టీ పట్ల ఆకర్షితులవుతున్న తీరు చూస్తుంటే వైఎస్సార్ సీపీ మరోసారి విజయ దుందుభి మోగించడం ఖాయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ఆలమూరు, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో పార్టీ నేతలు ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి (దొరబాబు), చల్లా సత్యనారాయణ (నానాజీ) ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన సుమారు 250 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రావులపాలెం మండలం గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. ఎన్నికల్లో కష్టపడిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కార్యకర్తలపై చూపుతున్న ఆదరణ చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్లు నేతలు తెలిపారు.

ఓటేయడం అందరి బాధ్యత

- గత ఎన్నికల్లో 74 శాతం మాత్రమే పోలింగ్
- ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృత ప్రచారం



అమలాపురం టౌన్: ప్రచార పర్వం ముగిసింది. హామీల వర్షం కురిసింది. ఓటరు వంతే మిగిలింది. ఓటేయడం అందరి బాధ్యత. ఈ రోజు గడిస్తే చేజారిన అవకాశం మళ్లీ రాదు. నచ్చిన నేతను ఎంచుకునే అవకాశం ఉండదు. అందుకే ప్రతి ఒక్కరూ నిరాసక్తత వీడి పోలింగ్ కేంద్రానికి తరలిరావాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అమలాపురం నియోజవకర్గంలో 2019 ఎన్నికల్లో దాదాపు 74 శాతం మంది ఓటర్లు ఓటు వేస్తే మరో 26 శాతం మంది నిరాసక్తతను ప్రదర్శించారు. ఈ దఫాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా యువ ఓటర్లు ఎంతవరకూ ఓటు హక్కును వినియోగించుకుంటారన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పోలింగ్ శాతం పెరగడం ఖాయమా..?

అమలాపురం నియోజకవర్గంలో 2,13,508 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 1,06,268 మంది పురుషులు, 1,07,2439 మంది మహిళలు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చిచే ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం పెరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈసారి నియోజకవర్గంలో కొత్తగా ఓటు హక్కు పొందిన 4,210 మంది యువ ఓటర్లు ఓటేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. గతంలో అధిక శాతం వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసే ఓపిక లేక ఆగిపోయేవారు. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటేసేందుకు హోమ్ ఓటింగ్ అవకాశాన్ని తీసుకొచ్చింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటర్లను చైతన్య పరచడానికి అటు ఎన్నికల సంఘం, ఇటు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతి దశలోనూ ప్రయత్నాలు సాగించారు. సోషల్ మీడియా ద్వారా ఓటు చైతన్యంపై విస్తృత ప్రచారాలు చేశారు. ఓటు ఎందుకు వేయాలనే సంకల్పాన్ని తెలియపరుస్తూ కళారూపాలు, లఘు చిత్రాలు ప్రదర్శించారు. దీనికి తోడు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖతో పాటు 1,300 మందితో కూడిన కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తామని ఓటర్లకు భరోసా కల్పించారు. ఈ ప్రయత్నాలతో ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం ఖాయమని భావిస్తున్నారు.

ఇంటికొచ్చిన సంక్షేమం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు
- ఇంటింటికీ రేషన్ పంపిణీ
- సరికొత్త ఒరవడికి శ్రీకారం

నియోజకవర్గం	వాహనాలు	రేషన్ కార్డులు
పి.గన్నవరం	51	86,249
కొత్తపేట	64	96,646
రాజోలు	44	68,589



మామిడికుదురులో మొబైల్ వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ

మామిడికుదురు: ప్రజలకు పాలన చేరువైంది.. ప్రతి పనీ ఇట్టే జరిగిపోతోంది.. వైఎస్సార్ సీపీ తీసుకొచ్చిన సంస్కరణలు ప్రజల జీవితాలకు వెలుగునిచ్చింది.. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటింటికీ రేషన్ పథకం ద్వారా ఎంతో మేలు జరిగింది. రేషన్ సరకుల కోసం క్యూలో గంటల తరబడి పడిగాపులు పడే విధానానికి స్వస్తి చెబుతూ ఇంటి వద్దే రేషన్ సరకులు అందించడం ముదావహమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఇంటింటికీ తిరిగి రేషన్ సరకులు అందజేయడం వల్ల ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు తప్పాయి. 2021 జనవరి 21న సీఎం జగన్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు.

159 వాహనాల ద్వారా పంపిణీ

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో 159 వాహనాల ద్వారా సుమారు 2,51,484 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటింటికీ రేషన్ సరకులు అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన స్వర్ణరకం సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్నారు. దీంతో పాటు పంచదార, ఇతర సరకులను మొబైల్ వాహనం ద్వారా ఇంటింటికీ అందజేస్తున్నారు. తూకాల్లో ఎటువంటి తేడాలు లేకుండా అధునాతన ఎలక్ట్రానిక్ కాటాతో లబ్ధిదారుని ఎదుటే తూకం వేయడం ద్వారా పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ పథకం ద్వారా నిరుద్యోగులకు రాయితీపై వాహనాలు అందించి వారికి ఉపాధి కల్పించారు.

ఎంతో సౌలభ్యంగా..



ప్రతి నెలా మా ఇంటి వద్దే రేషన్ సరకులు తీసుకుంటున్నాం. గతంలో రేషన్ డిపోకు వెళ్లి అక్కడ క్యూలో నిల్చుని సరకులు తీసుకునే పరిస్థితి ఉండేది. కానీ నేడు ఆ ఇబ్బందులు తప్పాయి. నేరుగా ఇంటి వద్దనే క్షణాల్లో సరకులు తీసుకుంటున్నాం. రేషన్ కార్డులో ఉన్న ఎవరైనా వేలిముద్ర వేస్తే సరిపోతుంది. ఇది ఎంతో సౌలభ్యంగా ఉంది.

– పిల్లి ప్రమీల, పాశర్లపూడి, మామిడికుదురు మండలం

చాలా ఆనందంగా ఉంది



రేషన్ సరకులతో లోడ్ చేసిన వాహనం ప్రతి నెలా సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇంటి వద్ద ఆగుతోంది. అక్కడకు వెళ్లి సరకులు తీసుకుంటున్నాం. ఈ ప్రక్రియ మొత్తం ఐదు నిమిషాల్లో ముగుస్తోంది. ఈ పథకాన్ని అమల్లోకి తీసుకు రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రధానంగా దీనివల్ల దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతోంది. నిరుద్యోగులకు కూడా ఉపాధి కల్పించింది.

– గోనిపాటి అన్నపూర్ణ, మొగలికుదురు

అనుక్షణం పేదల పక్షం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల అమలు
- ప్రతి కుటుంబానికి లబ్ధి
- సామాన్యులకు అండగా నిలిచిన సర్కారు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే పేదల పక్షం వహించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. ఆర్థిక కారణాలు చెప్పి సమస్యల పరిష్కారాన్ని విస్మరించరాదు. ఎన్ని సమస్యలు ఎదురైనా పేదల సంక్షేమమే లక్ష్యం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతోంది. దేశం మొత్తంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ అమలు చేయని స్థాయిలో సంక్షేమాన్ని ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఆ పథకాలన్నీ ప్రజలకు చేదోడుగా నిలిచాయి. మండపేట నియోజకవర్గంలో సంక్షేమ సాయంపై ఈ కథనం..

నియోజకవర్గంలో పేదలకు ఆసరాగా..

వైఎస్సార్ పింఛను పథకం ద్వారా మండపేట పట్టణంలో 7,107 మందికి రూ.94,41,00,000, రూరల్ మండలంలో 13,726 మందికి 123,19,50,500, కపిలేశ్వరపురం మండలంలో 17,447 మందికి రూ.198,89,58,000, రాయవరం మండలంలో 11,773 మందికి రూ.110,65,52,000 సాయమందించారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి

జగనన్న అమ్మఒడి పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 8,127 మందికి రూ.30,91,67,447, మండపేట పట్టణంలో 4,465 మందికి రూ.24,88,00,000 కపిలేశ్వరపురం మండలంలో 6,841 మందికి రూ.27,99,96,535, రాయవరం మండలంలో 5,913 మందికి రూ.26,35,61,392 విలువైన సాయాన్ని విద్యార్థులకు అందజేసింది. జగనన్న విద్యా కానుక పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2672 మందికి రూ.16,74,57,112, రాయవరం మండలంలో 3277 మందికి రూ.2,32,73,254 సాయమందించింది.

ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2,597 మందికి రూ.10,06,88,818 కపిలేశ్వరపురం మండలం 2,822 మందికి రూ.11,64,99,517 రాయవరం మండలంలో 3,009 మందికి రూ.12,21,20,444 మండపేట పట్టణంలో 2,338 మందికి రూ.9,61,00,000 సాయమందించింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2,897 మందికి రూ.5,00,68,314 రాయవరం మండలంలో 2,095 మందికి రూ.1,52,33,125 సహకారం అందించింది.



పింఛను డబ్బులు అందుకుంటున్న లబ్ధిదారు (ఫైల్)

రైతుకు బాసటగా నిలిచిన ప్రభుత్వం

వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 7,002 మందికి రూ.29,84,54,435, మండపేట పట్టణంలో 2,073 మందికి రూ.7,19,00,000, కపిలేశ్వరపురం మండలంలో 8,746 మందికి రూ.38,63,77,288, రాయవరం మండలంలో 7,435 మందికి రూ.31,96,76,950 పెట్టుబడి సాయమందించింది. ఇన్‌పుట్ సబ్సిడీ పథకం ద్వారా మండపేట మండలంలో 4,621 మందికి రూ.4,26,11,050, రాయవరం మండలంలో 5,796 మందికి రూ.6,19,68,231 సాయమందించింది.